క్లుప్తంగా

బస్సు సర్వీసు పునరుద్ధరించాలి



ఆందోళన చేస్తున్న కాచాపూర్ గ్రామస్తులు

శంకరపట్నం: మండలంలోని కాచాపూర్ గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసు పునరుద్ధరించాలని గ్రామస్తులు ఆందోళన చేశారు. భారీ వర్షాలకు రోడ్డు గుంతలమయంగా తయారైందని కరీంనగర్ డిపోకు చెందిన బస్సును నిలిపివేశారు. దీంతో విద్యార్థులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని సంబంధిత అధికారులు స్పందించాలని కోరారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక



రామడుగు: ఎంపికైన విద్యార్థులు

వీణవంక: మండలంలోని ఘన్ముక్కుల మోడల్ స్కూల్ విద్యార్థులు ఇటీవల జరిగిన ఎస్జీఎఫ్ మండల స్థాయి క్రీడల్లో సత్తాచాటారు. 30 మంది విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగే క్రీడలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ మోయిజ్ బేగ్ తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు షాబీర్‌పాషా అభినందించారు.

రామడుగు: మండలంలోని వెలిచాల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు అండర్ -14, 17 సంవత్సరాల విభాగంలో జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రాజరాజేశ్వరి, పీడీ దత్తాత్రిశర్మ తెలిపారు. వాలీబాల్ పోటీలకు అశ్విత, వైష్ణవి, మహిత, అరవింద్, మన్విత్, కబడ్డీ పోటీలకు శ్రీనిధి, అరుంధతి, అఖిల్ ఎంపికయ్యారని తెలిపారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

విజ్ఞాన మేళాలో సత్తా



బహుమతి అందుకుంటున్న వ్యోమిక

జమ్మికుంట: పట్టణంలోని శ్రీసరస్వతి శిశు మందిర్ విద్యార్థిని సుకాసి వ్యోమిక కామారెడ్డిలో నిర్వహించిన సరస్వతి విద్యాపీఠ రాష్ట్ర స్థాయి విజ్ఞాన మేళాలో అండర్-14 విభాగంలో సత్తా చాటింది. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా రాష్ట్రస్థాయి ద్వితీయ బహుమతి అందుకుంది. విద్యార్థినిని పాఠశాల శిక్షకులు ఆచారి సౌందర్య మాతాజీ, ప్రధానోపాధ్యాయులు గుడికందుల సుదర్శన్, ఆచార్య బృందం అభినందించారు.

చికిత్స పొందుతూ మృతి

శంకరపట్నం: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన ఓరుగంటి భారతి(52) హన్మకొండలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన ఓరుగంటి భారతి ఇంట్లో ఈ నెల12న కుటుంబ సభ్యుల మధ్య గొడవ జరిగింది. క్షణికావేశంలో గడ్డి మందు సేవించగా కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందిందని, భర్త వెంకట్‌రెడ్డి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

గోపగోని కొమురమ్మ సంస్మరణ సభ

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలో మావోయిస్టుల తల్లి గోపగోని కొమురమ్మ ఇటీవల మృతిచెందగా సైదాపూర్ మాజీ ఎంపీపీ, సామాజిక ఉద్యమకారుడు పాడిశెట్టి వెంకటరాజం అధ్యక్షతన ఆదివారం సంస్కరణ సభ జరిగింది. ఈసందర్భంగా పలువురు వక్తలు ప్రసగించారు. కొమురమ్మ కుమారులు మహేశ్, కుమారస్వామి, రవన్న ప్రజాఉద్యమం కోసం చేసిన పోరాట స్మృతులను గుర్తు చేసుకున్నారు. వీరుల ఆశయ సాధనలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో జనసాహితీ కన్వీనర్ ఆవునూరి సమ్మయ్య, భారత నాస్తిక సంఘం జాతీయ నాయకుడు జీడీ సారయ్య, ప్రజా సంఘాల నాయకులు బీమోజు సదానందం, గాలేబు ఆగయ్య, మిడ్డిడ్డి శ్రీనివాస్, బత్తుల సిద్దేశ్వర్, గోపు మహేందర్‌రెడ్డి తదితరులున్నారు.

కర్ర శ్రీహరి మృతి తీరనిలోటు

గన్నేరువరం: మున్నూరుకాపులకు కర్ర శ్రీహరి పటేల్ మృతి తీరని లోటని మున్నూరుకాపు సంఘం మానకొండూర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ గంప వెంకన్న అన్నారు. ఆదివారం మండలంలోని ఖాసీంపేట గ్రామంలో మాట్లాడారు. శనిగరం సర్పంచ్, ప్యాక్స్ చైర్మన్, కొహెడ ఎంపీపీగా, జెడ్పీటీసీగా నాలుగు దశాబ్దాలపాటు ప్రజల మధ్య ఉంటూ ప్రజాసేవ చేస్తూ ఇందుర్తి నియోజకవర్గంలో తనదైన ముద్ర వేసుకున్నారని తెలియజేశారు. మృతిపట్ల మానకొండూరు నియోజకవర్గ మున్నూరుకాపు సంఘం తరఫున సంతాపం తెలిపారు.

అప్రమత్తతే ఆయుధం



కేజీబీవీలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

- ఆపద సమయంలో అత్యవసర నంబర్లు మర్చిపోవద్దు
- బాలికలు, మహిళలకు పోలీసుల సూచన
- స్కూల్, కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలు

వీణవంక: ఆపద, ప్రతికూల పరిస్థితులను ఎలా ఎదురుకోవాలి, ఎవరికి ఫోన్ చేయాలి తదితర అంశాలపై మహిళలు, బాలికలను అప్రమత్తం చేసేందుకు వీణవంక పోలీసులు శ్రీకారం చుట్టారు. ఎస్సై ఆవుల తిరుపతి ఇటీవల విధుల్లో చేరినప్పటి నుంచి స్కూళ్లు, కాలేజీలతో పాటు జనసంచారం ఉన్న ఏరియాల్లో బాలికలు, మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో క్రైం రేట్ కూడా చాలా వరకు తగ్గింది. డయల్ 100, చైల్డ్‌లైన్, ఉమెన్ హెల్ప్‌లైన్ నంబర్లు 1098, 181 మరిచిపోవద్దని సూచిస్తున్నారు. సైబర్ క్రైం మోసాలు, వాటిని ఎలా ఎదుర్కోవాలో తెలియజేస్తున్నారు. అప్రమత్తతో ఎలాంటి అనర్థాలనైన అరికట్టవచ్చునని, అత్యవసర నంబర్లు ఎట్టి పరిస్థితుల్లో మరిచిపోవద్దంటూ తెలియజేస్తున్నారు. ప్రభుత్వం కఠిన చట్టాలు తీసుకొచ్చింది. నేరం జరిగిన వెంటనే శిక్ష అమలయ్యేలా పోలీసులు చర్యలు తీసుకొంటున్నారు. మండల వ్యాప్తంగా 42 ప్రభుత్వ పాఠశాలలతో కేజీబీవీ, మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. లాక్‌డౌన్ సమయంలో ఆన్‌లైన్ క్లాసులతో సెల్‌ఫోన్‌ల వాడకం ఎక్కువైంది. సామాజిక మాధ్యమాల్లో మంచి కంటే చెడు ఎక్కువగా వ్యాపిస్తోందని లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకుసాగాలని పోలీసులు సూచిస్తున్నారు.

ఆపద ఉందని తెలిస్తే, అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా డయల్ 100 ఫోన్ చేస్తే పోలీసులు పది నిమిషాల్లో అందుబాటులో ఉంటారని, ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో బ్లూకోల్ట్స్ సిబ్బంది అందుబాటులో ఉంటూ గస్తీ నిర్వహిస్తారని, సమస్య ఎదురైతే ఎలా బయటపడాలో ఆలోచించాలని, క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడొద్దని, తల్లిదండ్రులు పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తుండాలని తెలియజేస్తున్నారు.

గుర్తుంచుకోవాల్సిన విషయాలు

- జనసంచారం లేని నిర్మానుష్య ప్రాంతాల్లోకి ఒంటరిగా వెళ్లొద్దు.
- అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలి, వాళ్ల కదలికలపై నిఘా పెట్టాలి.
- సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలి, సెల్‌ఫోన్ అతిగా వినియోగించొద్దు.
- అపరిచిత ఫోన్‌కాల్స్‌కు స్పందించొద్దు, ఆకతాయిలు వేధిస్తే ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలి.
- తల్లిదండ్రుల కలలను సాకారం చేయడానికి మంచి మార్గంలో పయణించాలి, క్షణికావేశంలో ఎలాంటి దుశ్చర్యలకు పాల్పడొద్దు.

మనోధైర్యం కోల్పోవద్దు



బాలికలు, మహిళలు ఆపదలో మనోధైర్యం కోల్పోకూడదు, అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి. ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే డయల్ 100 ఫోన్ చేయాలి. అసభ్యకరంగా ప్రవర్తించేవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకొంటాం. సైబర్‌క్రైం మోసాలతో జాగ్రత్తగా ఉండాలి. ఉన్నతాధికారుల ఆదేశాలతో స్కూల్, కాలేజీల్లో అవగాహన కల్పిస్తున్నాం, తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి.

– ఆవుల తిరుపతి, ఎస్సై, వీణవంక

ప్రతీ బూత్‌లో జెండా ఎగురవేయాలి





రామడుగులో బీజేపీ నాయకుల సమావేశం, ఇల్లందుకుంటలో సేవా కార్యక్రమాలపై నాయకుల చర్చ

రామడుగు: మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ సేవా పక్షం మండల కన్వీనర్ పోచంపల్లి నరేశ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి మండల ఇంచార్జి జాడి బాల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించే వివిధ కార్యక్రమాలను ప్రతి కార్యకర్త విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మాజీ అధ్యక్షుడు ఒంటెల కరుణాకర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బండ తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పూరెల్ల శ్రీకాంత్‌గౌడ్, నాయకులు వేముండ్ల కుమార్, క్లోం శివ, జాతరగొండ ఐలయ్య, గుంట అశోక్, కడారి స్వామి, సంటి జితేందర్, రాజు, బండారి శ్రీనివాస్, కట్ట రవీందర్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

ఇల్లందకుంట: భారతీయ జనతాపార్టీ ఇల్లందకుంట మండల అధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో సేవాపక్షం మండల కార్యశాల నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఓబీసీ జిల్లా ప్రధానకార్యదర్శి ఆకుల రా జేందర్ హాజరయ్యారు. 17న తెలంగాణవిమోచన దినోత్సవం సందర్భంగా మండలంలోని ప్రతి బూత్‌లో జాతీయ జెండా ఎగురవేయాలని సూచించారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం పురస్కరించుకొని అక్టోబర్ 2 వరకు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గుత్తికొండ రాంబాబు, మండల కోకన్వీనర్ తాళ్ల పాపిరెడ్డి, మట్ట పవన్‌రెడ్డి, ఇంగ్లే రమేశ్, మురహరిగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు జాతీయ పురస్కారాలు





హుస్నాబాద్‌లో జాతీయ పురస్కారాలు అందుకుంటున్న కళాకారులు, నాగుల సత్యంగౌడ్

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల కళాకారులు విశ్వకర్మ జాతీయ పురస్కారాలు అందుకున్నారు. ఆదివారం హుస్నాబాద్‌లోని రాజ్యలక్ష్మి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పురస్కారాలు ప్రదానం చేశారు. శ్రీరామోజు రాజ్ కుమార్ కళారంగంలో చెల్పూరి శంకరాచారి(ఇందుర్తి) పురోహిత, బొమ్మనపల్లికి చెందిన కనపర్తి బ్రహ్మనందాచారి విశ్వబ్రాహ్మణ సేవా, కొండాపూర్‌కు చెందిన వేమునూరి సంపత్ నాటకరంగంలో పురస్కారాలు అందుకున్నారు. పురస్కారాలను సిద్దిపేట గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, పీఠాధిపతులు శ్రీవీరధర్మజస్వామి చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నామని తెలియజేశారు. మెమోంటో, ప్రశంసాపత్రాలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

నాగుల సత్యంగౌడ్‌కు..

హుజూరాబాద్: హుస్నాబాద్ మండల కేంద్రంలోని నాగారం రాజ్యలక్ష్మి కన్వెంట్‌హాల్‌లో విరాట్ విశ్వకర్మ విజ్ఞాన ఆధ్యాత్మిక ధార్మిక కళాపరిషత్ జాతీయ సంస్థల పక్షాన విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం పురస్కరించుకొని పట్టణానికి చెందిన నాగుల సత్యంగౌడ్ జాతీయ స్థాయి విశ్వగురువు పురస్కారానికి ఎంపికయ్యారు. సిద్దిపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ లింగమూర్తి, డాక్టర్ కాశీ జగన్నాథం, చొల్లేటి కృష్ణమూర్తి, విశ్వకళా విరాట్ బ్రహ్మశ్రీ వంగల శాంతికృష్ణ ఆచార్యులు, విశ్వకర్మ రాష్ట్ర సంఘం అధ్యక్షుడు విశ్వ విరాట్ కళారత్న పోలాజీ రాజ్‌కుమార్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. సత్యంగౌడ్ పురస్కారం అందుకోవడం పట్ల పట్టణానికి చెందిన ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలి



డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఎస్వీజేసీ యాజమాన్యం

కరీంనగర్: విద్యార్థులు ఇంటర్మీడియెట్ దశలోనే ఉన్నత లక్ష్యాలను ఎంపిక చేసుకొని, వాటిని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని మంచిర్యాల డిప్యూటీ కలెక్టర్ గూడూరి శ్రీనివాస రావు అన్నారు. ఆదివారం నగరంలోని తీగలగుట్టపల్లిలో గల రంగినేని గార్డెన్స్ ప్రాంగణంలో జరిగిన ఎస్వీజేసీ కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్‌డే వేడుకలకు హాజరై మాట్లాడారు. పోటీ ప్రపంచంలో విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించినప్పుడే చదివిన చదువుకు సార్థకత ఉంటుందని తెలిపా రు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు, పాటలు, నాటికలు అలరించాయి. రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యం జ్ఞాపికలతో సత్కరించింది. కళాశాల కరస్పాండెంట్ వి.మహేందర్‌రెడ్డి, ఎస్వీజేసీ బాలుర క్యాంపస్ ప్రిన్సిపాల్ వరప్రసాద్, బాలికల క్యాంపస్ ప్రిన్సిపాల్ కె.రాంరెడ్డి, డైరెక్టర్లు సింహాచలం హరికృష్ణ, వంగల సంతోష్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మరమ్మతులు



చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి–కోహెడ మధ్య మోయతుమ్మెద వాగుపై కల్వర్టు ధ్వంసం కావడంతో మరమ్మతు పనులు రెండో రోజు కొనసాగాయి. శనివారం ఇందుర్తికి చెందిన నలుగురు వ్యక్తులు వాహనదారుల ఇబ్బందులు చూడలేక తాత్కాలిక మరమ్మతులు చేయగా ఆదివారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ధరణి కన్‌స్ట్రక్షన్ కంపెనీ వారితో మాట్లాడి టిప్పర్లతో మట్టి పోయించారు. స్థానిక కాంగ్రెస్ నాయకుల విన్నపం మేరకు మర్మమతులు చేయడంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నూతన కార్యవర్గం

చొప్పదండి: పట్టణంలోని యంగ్ బాయ్స్ యూత్ క్లబ్ అధ్యక్షుడిగా మహమ్మద్ షాబీర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఉపాధ్యక్షుడిగా కడారి మోహన్, ప్రధాన కార్యదర్శిగా బొడిగె మహేందర్ గౌడ్, కోశాధికారిగా జాతరగొండ రాజశేఖర్, ప్రచా ర కార్యదర్శిగా బొడిగె రమేశ్ గౌడ్‌ను ఎన్నుకున్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటు కమిటీ



ఎన్నికైన కమిటీ సభ్యులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామంలో ఎల్లమ్మ ఆలయం ఆవరణలో గ్రామానికి చెందిన గౌడ యువకులు సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటు కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పంజాల గణేశ్, ఉపాధ్యక్షుడిగా మోడెమ్ శివప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా పంజాల అరవింద్, కోశాధికారిగా పంజాల శివకుమార్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులుగా గుడెల్లి రమేశ్, నగునూరి అనిల్ వ్యవహరించారు.

విశ్రాంత ఉద్యోగుల ఎన్నికలు



ప్రమాణం చేస్తున్న నాయకులు

జమ్మికుంట: జమ్మికుంట పట్టణ, మండలంలోని విశ్రాంత ఉద్యోగుల ఎన్నికలు ఆదివారం జమ్మికుంటలో నిర్వహించారు. అధ్యక్షుడిగా తూముల మోహన్‌రావు, కార్యదర్శిగా బుర్రా విఠల్‌రావు, కోశాధికారిగా దేవునూరి సాంబయ్య, అసోసియేట్ అధ్యక్షుడిగా కలకొండ శ్రీధర్‌రావు, గౌరవ అధ్యక్షుడిగా రామనాథం, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతుల స్టడీటూర్



స్టడీటూర్‌కు తరలివెళ్తున్న చైర్‌పర్సన్, పాలక వర్గం

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్, పాలకవర్గం సభ్యులు ఇతర రాష్ట్రాల్లోని మార్కెట్ నిర్వహణ, రైతులకు అందుతున్న సౌకర్యాలు, అభివృద్ధిపై ఆయా మార్కెట్‌ల సందర్శనకు ఆదివారం తరలివెళ్లారు. మార్కెట్‌లో క్రయవిక్రయాలు, రైతుల కోసం అభివృద్ధి పనులు, తీసుకుంటున్న చర్యలు పరిశీలించనున్నారు. వెళ్లేవారిలో మార్కెట్ చైర్‌పర్సన్ స్వప్నసదానందం, వైస్‌చైర్మన్ సతీశ్‌రెడ్డి, పాలకవర్గం, అధికారులు ఉన్నారు.



అ'పూర్వ' సమ్మేళనం

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1984 పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు నలభై ఏళ్ల తర్వాత అందరూ ఒకచోట కలుసుకొని చదువుకున్న రోజులనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.



హుజూరాబాద్: హుజూరాబాద్ డివిజన్ పరిధిలోని గ్రామీణ ప్రాంత రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. గుంతల రోడ్డుపై ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడటంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటనలున్నాయని, సంబంధిత అధికారులు పట్టించుకోవడలేదని వాపోతున్నారు. సైదాపూర్–జాగీర్‌పల్లి గ్రామాల మధ్య రోడ్డు ధ్వంసమైందని, సంబంధిత అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులైనా చేయించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
పల్లా రాజశేఖర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ, సెల్ నంబర్: 8328131368

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

తొలగించినవారిని విధుల్లో చేర్చుకోవద్దు



ఇన్‌చార్జి డీఈవో మొండయ్య విచారణ (ఫైల్)



ఎమ్మెల్యే కవ్వంపల్లి ఎదుట రోదిస్తున్న విద్యార్థిని(ఫైల్)

శంకరపట్నం: కేశవపట్నం కేజీబీవీ హెడ్‌కుక్, వంటమనుషులను ఇటీవల విధుల నుంచి తొలగించారు. కానీ వారు విధుల్లో చేరేందుకు అధికార పార్టీ నేతల చుట్టూ తిరుగుతున్నారు. జూలై 15న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కేజీబీవీని సందర్శించారు. కూరలు రుచిగా లేవంటే వంట మనుషులు తిడుతున్నారని విద్యార్థినులు కన్నీళ్లు పెట్టుకున్న విషయం తెలిసిందే. హెడ్‌కుక్ రేణుకపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేసి సస్పెండ్ చేయాలని అధికారులకు సూచించారు. జూలై 17న ఇంచార్జి డీఈవో మొండయ్య విచారణ చేసి విధుల నుంచి తొలగించారు. 24న అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే కేజీబీవీని తనిఖీ చేసి విద్యార్థినులతో కలిసి భోజనం చేసి ధైర్యం చెప్పారు. విద్యార్థినులను దూషించిన ఘటనలో హెడ్‌కుక్, కుక్, స్వీపర్లను అధికారులు ఉద్యోగం నుంచి తొలగించిన సంఘటన మరువక ముందే మళ్లీ విధుల్లో చేరుతామంటూ విద్యాశాఖలో పని చేస్తున్న మహిళా అధికారితో పాటు అధికార పార్టీ నేతల చుట్టూ తిరుగుతుండటంతో విద్యార్థినులు ఆందోళన చెందుతున్నారు. హెడ్‌కుక్, కుక్, స్వీపర్ పోస్టులకు ఈనెల 12లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో లక్ష్మీనారాయణ నోటిఫికేషన్ విడుదల చేశారు. తాజాగా దరఖాస్తు గడువు 18 వరకు పెంచారు. తొలగించిన వారిని కాకుండా కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారిని ఎంపిక చేయాలని విద్యార్థినుల కుటుంబ సభ్యులు అధికారులను కోరుతున్నారు.

హిందీ భాషా దినోత్సవం



సైనిక శిక్షణ విద్యాలయంలో వేడుకలు

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ శివారు సైనిక శిక్షణ విద్యాలయంలో ఆదివారం హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించిన అనంతరం ప్రిన్సిపాల్ కాళహస్తి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయుడు శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో సదుపాయాలు కల్పించాలి



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న శేఖర్‌గౌడ్

మానకొండూర్: మండల కేంద్రంలోని బాలుర సమీకృత హాస్టల్‌లో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఉన్నతాధికారులు పరిశీలించినా సమస్యలు పరిష్కారం కాలేదని ఆదివారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితం కావడంతో మానకొండూర్ జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్ హాస్టల్‌ను పరిశీలించారు. మెష్‌డోర్లు లేక వెంటిలేటర్ల నుంచి దోమలు రాకుండా బట్టలు అడ్డుగా పెట్టడం, పనిచేయని మరుగుదొడ్లు చూసి ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్వోప్లాంటు, వంటశాల, కూరగాయలు పరిశీలించి వార్డెన్ రాజును వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాస్టళ్లలో పేదవిద్యార్థులు మాత్రమే ఉంటారని, చాలా దూర ప్రాంతాల నుంచి ఎన్నో ఆశలతో విద్యార్థులు హాస్టల్లో చేరుతారని, అలాంటి విద్యార్థులకు మంచి వసతులు కల్పించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.



జిల్లా అధ్యక్షుడు రాచకొండ నరేశ్‌తో మండల కార్యవర్గ సభ్యులు

సంఘం బలోపేతానికి కృషి చేయాలి

కరీంనగర్‌రూరల్: గ్రామస్థాయి నుంచి సంఘాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు రాచకొండ నరేశ్ అన్నారు. ఆదివారం కరీంనగర్ మండలం నగునూరులో జరిగిన మండల రజక సంఘం సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని రజకులందరినీ ఏకం చేసి సంఘం ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నా రు. అనంతరం రజక సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొత్తకొండ సురేందర్, ప్రధాన కార్యదర్శిగా సతీ శ్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా జటంగి నాగరాజు, కోశాధికారిగా వనపర్తి నాగరాజు, జిల్లా సోషల్ మీడి యా కన్వీనర్‌గా గంగిపల్లి విష్ణు ఎన్నికయ్యారు. సమావేశంలో సంఘం నాయకులు కొల్లూరి మల్లేశకుమార్, రాచకొండ కొమురయ్య, కొత్తకొండ శ్రీనివాస్, శివకృష్ణ, మైలారం శ్రీనివాస్, పొన్నం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.